MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

GHMC
hmda Growing Global
TS-bPASS

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

Happy 75th Independence Day

# క్రైమ్ THE మిర్రర్ ®

Voice of Anti Corruption

తెలంగాణ జిల్లాలు

శుక్రవారం 24-07-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్



# మారనున్న పల్లె రోడ్లు

- రూ.350కోట్లతో పరిపాలన అనుమతులు
- మెరుగుపడనున్న రవాణా సౌకర్యాలు

కాసిపేట గ్రామీణ ప్రాంత రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. నిధుల కొరతతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రహదారుల పునరుద్ధరణకు ప్రభుత్వం రూ.350.50కోట్ల నిధులు కేటాయించడంతో గ్రామీణప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హ్యామ్(హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) కింద రహదారులను నిర్మించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ)తో సరికొత్త విధానం ద్వారా పల్లెల్లోని రోడ్ల రూపురేఖలు మారనున్నాయి. దీంతో అంతర్గత రోడ్లను ఆధునీకరించి జిల్లాకేంద్రానికి అనుసంధానం చేస్తున్నారు. దీనివల్ల రవాణా సౌకర్యాలు మెరుగుపడి ప్రజలకు రహదారి కష్టాలు తీరనున్నాయి.

2లో

# శంకర్‌పల్లి కాంగ్రెస్ భారీ నిరసన

- కేంద్ర వైఖరిపై మండిపాటు
- శంకర్‌పల్లిలో కాంగ్రెస్ ఆగ్రహ నిరసన
- ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు పిలుపు
- కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు
- మోదీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- భారీ సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణుల



3లో

# బీజేపీ-కాంగ్రెస్ శ్రేణుల మధ్య తోపులాట



2లో

# బీసీ గురుకుల బాలికలకు అస్వస్థత

- వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేరిక
- ఏడుగురు బాలికలు జిల్లా ఆసుపత్రికి తరలింపు
- ఆహార, తాగునీటి నమూనాలు సేకరించిన అధికారులు
- తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దు: డీఎంహెచ్ఓ



**బెల్లంపల్లి జూలై 23 (క్రైమ్ మిర్రర్)**

మహాత్మా జ్యోతిబాపూలే బాలికల బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం రాత్రి పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. కడుపునొప్పి, వాంతులు, విరేచనాల లక్షణాలతో 12 మంది విద్యార్థినులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు.

మిగతా 2లో

# బీజేపీ-కాంగ్రెస్ శ్రేణుల మధ్య తోపులాట

**సంస్థాన్ నారాయణపురం, జూలై 23(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుర్వి రాజు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుని కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి మాట్లాడుతూ, గత 12 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అవినీతికి తావులేకుండా పారదర్శక పాలన అందిస్తూ, భారతదేశాన్ని ప్రపంచ వేదికపై గౌరవప్రదమైన స్థానంలో నిలబెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు దేశ ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొచ్చాయని పేర్కొన్నారు. ఢిల్లీలోని పార్లమెంట్ సమీపంలో నిరసన చేపడతామని ప్రకటించి, అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వద్దకు వెళ్లి నిరసన చేపట్టడాన్ని నిరసిస్తూ, సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసినట్లు తెలిపారు. రాజకీయ విభేదాలు ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ, హింస, తోపులాటలు, ఉద్రిక్తతలకు ఎలాంటి స్థానం లేదని ఆయన అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ,



శాంతియుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఘటనలు పునరావృతమైతే, ప్రజాస్వామ్యబద్ధంగా చట్టపరమైన మార్గాల్లో భారతీయ జనతా పార్టీ పోరాటం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమమని, రాజకీయ పార్టీలు ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు,మండల నాయకులు, ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండాలి

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా అధికారులు జాగ్రత్త వహించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అధికారులకు సూచించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని పోతేపల్లి, యంగంపల్లి, జిల్లెల, మార్చల గ్రామాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని గురువారం ఆయన సందర్శించారు. వెల్దండ మండలం పోతేపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యం గారితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి, బూత్ లెవల్ ఆఫీసర్ లకు పలు సూచనలు చేశారు. మరో పది రోజుల్లో ఓటరు జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులైన ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.కొత్త ఓటర్ల నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పులు, ఇతర అభ్యర్థనలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు తెలిపారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని గోలి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సరిచూసుకోవాలని, అవసరమైతే మార్పులు, చేర్పులు చేసుకోవాలని ఆయన సూచించారు.

## సిల్క్ నూతన పాలకవర్గానికి

### ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందనలు



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలోని శ్రీరామ సిల్క్ హ్యాండ్లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ నూతన పాలకవర్గ సభ్యులు గురువారం ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను నకిరేకల్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సిలువేరు అంజయ్య, ఉపాధ్యక్షుడు చిట్టిపోలు యాదయ్య, కార్యదర్శి కోడి జీవన్ కుమార్, కోశాధికారి కోడి చిరంజీవి, పాలకవర్గ సభ్యులు సిలువేరు పరమేష్, చిట్టిపోలు నవీన, కోడి స్వాతి, సిలువేరు కృష్ణ, కొంగరి సత్తయ్యలను ఎమ్మెల్యే వేముల వీరేశం శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార సంఘం అభివృద్ధికి నూతన పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలని సూచించారు. సంఘ సభ్యుల సంక్షేమం కోసం పనిచేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆవుల సుందరయ్య యాదవ్, నల్లగొండ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఆవుల మాధవి, నాయకులు మెట్టు వెంకటేశం వలిగొండ సత్యనారాయణ మెట్టు నాగ శంకర్ తదితరులు పాల్గొన్నారు

# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**ఆత్మకూరు(ఎం),జూలై23/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం గురువారం రోజు ఏఐసిసి పిసిసి పిలుపుమేరకు రాహుల్ గాంధీ అక్రమ అరెస్టుకు నిరసనగా మండల కేంద్రంలో ధర్నా మరియు రాస్తారోకో చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు కందడి అనంత రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరి వల్ల నీట్ పరీక్ష పత్రం లీక్ జరిగిందని సుమారు 21 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని చాలామంది విద్యార్థులు భవిష్యత్తు నాశనం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ నిరసన తెలియజేస్తుంటే కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తుందని తెలిపారు. దేశ ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న రాహుల్ గాంధీ మరియు ప్రియాంక గాంధీలను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యం స్ఫూర్తిని దెబ్బతీయడం లాంటిదని పేర్కొన్నారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాపతినిధులు, సర్పంచులు,అనుబంధ సంఘాల నాయకులు, యూత్ కాంగ్రెస్,ఎన్ఎస్యూఐ నాయకులు పాల్గొన్నారు.



## బీసీ గురుకుల బాలికలకు అస్వస్థత

(మొదటి పేజీ తరువాయి)

చికిత్స అనంతరం శుక్రవారం ఉదయం ఆరోగ్యం మెరుగుపడటంతో వైద్యులు వారిని డిశ్చార్జ్ చేశారు. అనంతరం శుక్రవారం ఉదయం మరో ఎనిమిది మంది విద్యార్థినులకు ఇదే తరహా లక్షణాలు కనిపించాయి. వారిలో ఏడుగురిని మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.సమాచారం అందుకున్న వెంటనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ నాయక్, బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి, డాక్టర్ అరుణ్‌లతో కలిసి గురుకుల పాఠశాలను సందర్శించారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వాసురామ్, ఎపిడిమియాలజిస్ట్ సుమన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అందించిన ఆహారం, తాగునీటి నమూనాలను సేకరించి పరీక్షల కోసం పంపించారు. వంటగదిలోని బియ్యం, పప్పులు, కూరగాయలు, గుడ్లు, వంటపాత్రల పరిశుభ్రతను పరిశీలించారు. కాచి చల్లార్చిన తాగునీటినే వినియోగించాలని, వంటశాల పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి డాక్టర్ సుచరిత ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. మిగిలిన విద్యార్థులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడిగా ఉన్న ఆహారాన్నే తీసుకోవాలని, భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, దోమల నివారణకు జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు సూచించారు.విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. నిపుణులైన వైద్యులతో చికిత్స అందిస్తున్నామని, ప్రభుత్వపరంగా అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించామని చెప్పారు. తల్లిదండ్రులు ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా ఆర్‌సీవో శ్రీధర్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, మున్సిపల్, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.అవసరమైతే దీనిని ప్రింట్ ఎడిషన్ ఈనాడు కాలమ్ ఫార్మాట్ (ఇంట్రో, మధ్య శీర్షికలు, బాక్స్ ఐటెమ్‌తో)లో కూడా సిద్ధం చేయగలను.

# మారనున్న పల్లె రోడ్లు

మంచిర్యాల జిల్లాలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు గుర్తించి పంపిన ప్రతిపాదనల మేరకు 358.16 కిలోమీటర్ల మేర మొత్తం 85రహదారులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం రూ.350.50కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఇందులో ఆర్అండ్‌బీ పరిధిలోని రహదారులను రూ.241కోట్లతో, 145.93కిలోమీటర్లు ఉన్నతీకరించనున్నారు. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని 32రహదారులను రూ.60కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. రహదారులకు అయ్యే మొత్తం నిధుల్లో ప్రభుత్వం 40శాతం భరించనుండగా సంబంధిత గుత్తేదారులు 60శాతం ఖర్చు చేస్తారు. తర్వాత గుత్తేదార్లకు ప్రభుత్వమే వాయిదాల ప్రకారం చెల్లిస్తుంది. 15ఏళ్ల పాటు సంబంధిత గుత్తేదారు నిర్వహణ బాధ్యతలను చూడాల్సి ఉంటుంది. త్వరలో టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి పనులను ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలోని రహదారులను గ్రామీణప్రాంతాలతో పాటు మండలకేంద్రాల రోడ్డుకు అనుసంధానం చేస్తూ రహదారిని మెరుగుపర్చనున్నారు. ఇందులో తాండూర్, భీమిని నుంచి మంచిర్యాల జిల్లా కేంద్రానికి 24కిలోమీటర్ల రోడ్డుతో మంచిర్యాల జిల్లా కేంద్రం వరకు అనుసంధానం చేయనున్నారు. అలాగే భీమారం టూ గురిజాల రోడ్డు నుంచి నెన్నెల మండల కేంద్రానికి 29.70కిలోమీటర్ల, మరో 12కిలోమీటర్ల వరకు రోడ్డును అనుసంధానం చేయనున్నారు.



## మునుగోడులో కాంగ్రెస్ నిరసన

**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ని అక్రమంగా అరెస్ట్ చేసి గాయపరిచిన మోదీ పాలనకు వ్యతిరేకంగా , నీట్ పరీక్షల లీకేజీపై ప్రధాని స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మునుగోడు మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యములో నల్ల రిబ్బన్లు ధరించి రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు.జిల్లా, మండల, కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు..

## మునుగోడు విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా




**మునుగోడు క్రైమ్ మిర్రర్:** కల్వకుంట్ల గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ముందు డివైఎఫ్ఐ ఆధ్వర్యములో ధర్నా నిర్వహించారు..గ్రామంలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని లేనియెడల గ్రామస్థులతో కలిసి విద్యుత్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి, బిక్షం, పగిల్ల యాదయ్య,కట్ట ఆంజనేయులు, మహేష్, జిక్కి పాల్గొన్నారు.

## వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలి

**మునుగోడు క్రైమ్ మిర్రర్:** తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అమెరికా భారత్ వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలని మోడీ దిష్టి బొమ్మ దగ్దం చేశారు.రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురుజ రామచంద్రం మాట్లాడుతూ రైతులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలుగూరి నరసింహ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తీర్పాటి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను,కౌన్సిల్ సభ్యులు లాల్,సర్పంచ్ బండమీది యాదయ్య పాల్గొన్నారు.




# శంకర్‌పల్లి కాంగ్రెస్ భారీ నిరసన

**కేంద్ర వైఖరిపై మండిపాటు**
- శంకర్‌పల్లిలో కాంగ్రెస్ ఆగ్రహ నిరసన
- ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు పిలుపు
- కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు
- మోదీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- భారీ సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణుల



**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్‌పల్లి ఇంద్రారెడ్డి చౌరస్తా గురువారం కాంగ్రెస్ పార్టీ ఆగ్రహ నినాదాలతో మార్మోగింది. రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి అధ్యక్షత వహించగా, మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మడపతి చంద్రమౌళి ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ప్రతిపక్ష నాయకుడిని రాజకీయ కక్షసాధింపుతో లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తిని అవమానించడమేనని విమర్శించారు. విభిన్న అభిప్రాయాలను అణచివేసే ధోరణి దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకర సంకేతమని పేర్కొన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కే ప్రతి ప్రయత్నాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని స్పష్టం చేశారు.రాహుల్ గాంధీకి జరిగిన అవమానానికి రాజకీయ బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే దేశ ప్రజల ముందు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో విమర్శలను ఎదుర్కొనే బదులు అధికార బలంతో ప్రతిపక్షాన్ని లక్ష్యంగా చేసుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపించారు. ఈ ఆందోళనలో టీపీసీసీ కార్యదర్శి ఉదయ్ మోహన్ రెడ్డి, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గోపాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కాలే శ్రీకాంత్, శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్‌పర్సన్ శ్వేతా పాండురంగారెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ గోవిందమ్మ గోపాల్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కాసెట్టి చంద్రమోహన్, సేవాదళ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం ప్రశాంత్ రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎంఎస్‌యూఐ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీట్ లీక్‌తో యువత భవిష్యత్తు చీకట్లో... నిరసన తెలిపితే అరెస్టులా?

**గుండాలలో కాంగ్రెస్ ఆగ్రహ జ్వాలలు.. కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక**

**రాహుల్, ప్రియాంక అరెస్టులను ఖండిస్తూ భారీ రాస్తారోకో**



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 23 (క్రైమ్ మిర్రర్):** నీట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వం అగాధంలోకి నెట్టిందని కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో మండిపడింది. విద్యార్థుల న్యాయం కోసం పోరాడుతున్న ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులపై ప్రత్యక్ష దాడేనని ఆగ్రహం వ్యక్తం చేసింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు, యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు గుండాల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ఇమ్మడి దశరథ గుప్తా నేతృత్వంలో భారీ రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ, “నీట్ పేపర్ లీకేజీతో విద్యార్థుల కలలను చిదిమేసిన కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి. దేశ యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు” అని హెచ్చరించారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ చేపట్టిన నిరసనను అడ్డుకుని అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని గొంతు నులిమే చర్యగా అభివర్ణించారు. “ప్రశ్నించే గొంతులను అణచివేయడం మోదీ ప్రభుత్వానికి అలవాటైపోయింది. కానీ కాంగ్రెస్ వెనక్కి తగ్గదు.. విద్యార్థుల కోసం పోరాటం మరింత ఉధృతం చేస్తాం” అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఏలూరి రామ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పొడిచెట్టి వెంకన్న, పట్టణ అధ్యక్షుడు కొడపర్తి భాస్కర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ రెడ్డి, చేనేత సహకార సంఘం చైర్మన్ చిందం ప్రకాష్, పీఏసీఎస్ డైరెక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కృష్ణా గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో 270 మంది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

**క్రైమ్ మిర్రర్,ఎల్బీనగర్ , జూలై 23:** కృష్ణా గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో పేద విద్యార్థుల పాఠశాల లో కరీంనగర్ నివాసి, సందీప్ రెడ్డి సహకారంతో సుమారు 270 మంది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, సమితి సభ్యుల సేవాభావం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు చేయూతనందించేందుకు ముందుకు వచ్చిన సందీప్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా గోపాల్ సేవా సమితి సభ్యులు, స్థానిక ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# నాగోల్ లోని రాజలక్ష్మి కాలనీలో నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణం

### ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం



**క్రైమ్ మిర్రర్,ఎల్బీనగర్,జులై 23:** నాగోల్ పరిధిలోని రాజలక్ష్మి కాలనీలో నూతనంగా నిర్మించిన "రాజలక్ష్మి కాలనీ కమ్యూనిటీ హాల్" ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీమతి కొలన్ రాజ్యలక్ష్మమ్మ (పెద్దగౌడ్) జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కొలన్ నర్సింహా గౌడ్, కొలన్ ప్రభాకర్ గౌడ్, కొలన్ చంద్రశేఖర్ ఆజాద్, కొలన్ భరత్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించి కాలనీవాసులకు అంకితం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ ప్రజల సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు, శుభకార్యాల నిర్వహణకు ఈ కమ్యూనిటీ హాల్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సమాజానికి శాశ్వత ప్రయోజనం చేకూర్చే ఆస్తిని నిర్మించి ప్రజలకు అందించిన దాతలను ఆయన అభినందించారు. అనంతరం యువ నాయకుడు కొలన్ చంద్రశేఖర్ ఆజాద్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్, మాజీ నాగోల్ స్కూల్ కమిటీ అధ్యక్షులు బద్దం వెంకటేష్ గౌడ్, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు అనంతుల రాజరెడ్డి, తూర్పటి చిరంజీవి, రంగేశ్వరి నాయుడు, సతీష్ యాదవ్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల గొంతు కోస్తున్న విద్యుత్ శాఖ..!

### 18 గంటల కరెంట్‌ను 12 గంటలకు కుదించడం దారుణం -- సుద్దాల సబ్‌స్టేషన్ ముట్టడించిన రైతులు

### అప్రకటిత విద్యుత్ కోతలు వెంటనే ఎత్తివేయాలి.. లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో,జూలై 23 (క్రైమ్ మిర్రర్):** వ్యవసాయాన్ని కాపాడాల్సిన విద్యుత్ శాఖే రైతుల నడ్డి విరుస్తోందని మండిపడుతూ సుద్దాల సబ్‌స్టేషన్ ఎదుట రైతులు, ప్రజాప్రతినిధులు ఆందోళనకు దిగారు. ఒకవైపు 18 గంటల విద్యుత్ ఇస్తామని ప్రకటించి, మరోవైపు కేవలం 12 గంటలకే పరిమితం చేయడం రైతులను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్రకటిత విద్యుత్ కోతలతో మోటార్లు నడవక పంటలు ఎండిపోతున్నా అధికారులకు చీమకుట్టినట్టూ లేదని విమర్శించారు. ప్రభుత్వం చెప్పేది ఒకటి, క్షేత్రస్థాయిలో జరుగుతోంది మరొటని మండిపడ్డారు. రైతుల చెమటతో పండిన పంటలను విద్యుత్ కోతలతో నాశనం చేసే కుట్రను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. "రైతును బతికించాలంటే నిరంతర విద్యుత్ ఇవ్వాలి.. లేకపోతే పంటలు ఎండిపోవడమే కాదు, రైతు కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుంది" అని నాయకులు హెచ్చరించారు. వెంటనే అప్రకటిత విద్యుత్ కోతలను ఎత్తివేసి, ప్రకటించిన 18 గంటల విద్యుత్ సరఫరాను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యుత్ శాఖ కార్యాలయాల ముట్టడితో పాటు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ ధర్నాలో సుద్దాల సర్పంచ్ మహోదయ్, అనంతారం సర్పంచ్ వినోద్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ పండరి, నాయకులు రవి, శ్రీను, నాగేష్, బిక్షం, ఐలయ్య, కేఎస్ఆర్, రామచంద్రు, కుమార్, మోహన్ రెడ్డి, వెంకటేష్, మహేష్, నరేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన యువ శౌర్య సేన ఉపాధ్యక్షురాలు కావ్యకు ఘన సన్మానం

### యువ శౌర్య సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు రవీందర్ లంటు యాదవ్ చేతుల మీదుగా సత్కారం



**క్రైమ్ మిర్రర్ -- శంకర్‌పల్లి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన యువ శౌర్య సేన ఉపాధ్యక్షురాలు కావ్య గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన సందర్భంగా యువ శౌర్య సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు రవీందర్ లంటు యాదవ్ ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ ఏడాది ఏప్రిల్ 26న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో విజన్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన చారిత్రాత్మక కరాటే ప్రదర్శనలో 1,212 మంది కరాటే యోధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అద్భుత ప్రతిభ కనబరిచిన కావ్య అధికారిక గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచారు. చిన్న వయసు నుంచే కరాటేపై ఆసక్తి పెంచుకున్న కావ్య, ఎల్బీకే బుడోకాన్ కరాటే అకాడమీలో శిక్షణ పొంది బ్లాక్ బెల్ట్ సాధించారు. క్రమశిక్షణ, అంకితభావం, కఠోర సాధన, దేశభక్తి, ధైర్యం, ఆత్మవిశ్వాసం, పోరాట పటిమతో అంతర్జాతీయ స్థాయిలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించి తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్ లంటు యాదవ్ మాట్లాడుతూ, "పట్టుదల ఉంటే అసాధ్యం అనేది ఏదీ లేదని కావ్య నిరూపించింది. నేటి సమాజంలో మహిళలు, బాలికలు తమ రక్షణ కోసం కరాటే, మార్షల్ ఆర్ట్స్ వంటి ఆత్మరక్షణ విద్యలను తప్పనిసరిగా నేర్చుకోవాలి. ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచే ఉచిత శిక్షణ అందించడంతో పాటు మహిళల భద్రతకు మరిన్ని చర్యలు తీసుకోవాలి. ప్రమాద పరిస్థితుల్లో తమను తాము రక్షించుకునే హక్కును భారతీయ చట్టాలు మహిళలకు కల్పించాయి" అని పేర్కొన్నారు. అనంతరం కావ్యకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్, మెడల్, శాలువాతో ఘనంగా సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ శౌర్య సేన సభ్యులు గౌస్ పాషా, విశాల్ చారి, జనార్ధన్, ఆనంద్, హర్షవర్ధన్, హనుమంతరావు, ప్రణతి, కావ్య, హర్షిని తదితరులు పాల్గొన్నారు.



# గడువులోగా సర్ పూర్తి చేయాలి

**క్రైమ్ మిర్రర్,మంగపేట:** మండలంలో సర్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా మండలంలోని కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి,తమకు కేటాయించిన పరిధిలో సర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెట్టిపల్లి వెంకటేశ్వర్లు,మంత్రి సీతక్క వ్యక్తిగత సహాయకులు భాస్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏల అత్యవసర సమావేశంలో వారు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం చేపట్టిన సర్ కార్యక్రమం అత్యంత కీలకమైనదని ప్రతి బీఎల్ఏ పార్టీ ఆదేశాలను కచ్చితంగా పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఓటరు జాబితా ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా ప్రతి ఇంటిని సందర్శించి కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తి చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త,ప్రతి బీఎల్ఏ, బిఎల్ఓలతో కలిసి సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి,ములుగు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆక రాధాకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య,భద్రాచలం శ్రీరామచంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్, మండల యూత్ అధ్యక్షుడు బాడిషా ఆదినారాయణ, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు పాయం అనిత,జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకట్ రెడ్డి,తుడి భగవాన్ రెడ్డి,శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన చైర్మన్ ఎర్రంగారి సురేష్, డైరెక్టర్ బోడ బొర్రయ్య, మండల మీడియా ఇంచార్జ్ బసారీకారి నాగార్జున్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

### ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

### జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని, విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేలా బోధన సాగించాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) రమేష్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందుకు అనుగుణంగా ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేయాలని ఆయన అన్నారు. గురువారం డీఈఓ రమేష్ కుమార్ నాగర్‌కర్నూల్ జిల్లాలోని తెల్కపల్లి, లింగాల మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి విద్యా బోధన, పాఠశాల నిర్వహణ, విద్యార్థుల అభ్యాసన స్థాయిలు, హాజరు, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న తరగతులను ప్రత్యక్షంగా వీక్షించి, విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను కేవలం చదవడం మాత్రమే కాకుండా అర్థం చేసుకొని ఆచరణలో వినియోగించే స్థాయికి చేరేలా బోధన ఉండాలని సూచించారు. ఈ పాఠశాలల తనిఖీలలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ సుజాత, ఏఎంఓ కిరణ్ కుమార్ తదితరులు డీఈఓ వెంట పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై బీజేపీ ఫైర్..!

**"బీజేపీని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు"**



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూలై 23 (క్రైమ్ మిర్రర్):** గుండాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బీజేపీ వ్యతిరేక ధర్నాకు నిరసనగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు పింగళి విజయ్ భాస్కర్ రెడ్డి నాయకత్వంలో ఘాటైన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, ఇప్పుడు బీజేపీపై విమర్శలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనం" అని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రతి అర్హ నిరుద్యోగికి నిరుద్యోగ భృతి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి చాలాకాలం గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. "నిరుద్యోగ యువత ఆశలతో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు ఆడుతోంది. బీజేపీపై ఆరోపణలు చేసే ముందు ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. హామీలు అమలు చేయలేని ప్రభుత్వం విమర్శలకు కాదు, సమాధానాలకు సిద్ధంగా ఉండాలి" అని ఆయన హెచ్చరించారు. బీజేపీపై విమర్శలతో ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి అమలు చేసి తన చిత్తశుద్ధిని నిరూపించాలని డిమాండ్ చేశారు. నిరసనలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్ వెంపటి సురేష్, ప్రధాన కార్యదర్శులు కప్పరి నాగిరెడ్డి, తోటకూరి శ్రీకాంత్, మండల కోశాధికారి పరమేశ్వరి, మండల కార్యదర్శి కుక్కల కృష్ణ, సీనియర్ నాయకులు మహేష్, ఎనిమిటి ఎల్లయ్య, సోమన్న, మహిపాల్ రెడ్డి, కార్తీక్, జానకి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐబిఇ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన ఉప్పల పెల్లి బాలు అల్లందేవిచెర్వు గ్రామ యువతకు ఆదర్శం :

**కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బత్క శేఖర్ యాదవ్**

**సంస్థాన్ నారాయణపురం, జూలై 23(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల అల్లందేవిచెర్వు గ్రామానికి చెందిన యువ న్యాయవాది అల్ ఇండియా బార్ ఎక్సమినేషన్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా, గురువారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బత్క శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి అభినందనలు తెలియజేస్తూ, న్యాయవాదిగా సమాజానికి న్యాయం చేయడంలో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఏఐబిఇ లో విజయం సాధించడం గ్రామానికి గర్వకారణమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండల గౌరవ అధ్యక్షుడు ఏర్పుల సురేష్ గ్రామ 6వ వార్డు సభ్యులు గుండు లింగస్వామి. బిఆర్ఎస్ పార్టీ నాయకులు సుర్వి లింగస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్క రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్నేహితులు మరియు గ్రామస్థులు పాల్గొని అభినందనలు తెలియజేశారు.



# విద్యార్థులపై లాఠీచార్జిని ఖండిస్తున్నాం. కట్టెల లింగస్వామి.

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 23(క్రైమ్ మిర్రర్):** నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజాస్వామికవాది, సామాజిక ఉద్యమకారుడు కట్టెల లింగస్వామి అన్నారు. నేడు చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ప్రజాస్వామికవాదుల ఆధ్వర్యంలో వలిగొండ రోడ్ లోని అంబేద్కర్ విగ్రహం ముందు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కట్టెల లింగస్వామి మాట్లాడుతూ దేశంలో నీట్ లాంటి ప్రశ్నాపత్రాల లీకేజీ ఏదో ఒక చిన్న తప్పిదం ద్వారా జరిగినది కాదు ఇది విద్యాశాఖ మంత్రి కనుసన్నల్లోనే లీకేజీలు జరుగుతున్నాయని గత కొన్ని సంవత్సరాల నుండి లీకేజీల పరంపర చూస్తుంటేనే అర్థం అవుతుందని ఆయన అన్నారు . గతంలో కూడా నీట్ ప్రశ్న పత్రం లీకేజీ జరగడాన్ని మనం చూశాం. నీట్ తో పాటు వివిధ పరీక్షలకు సంబంధించి 150 పేపర్ లీకేజీ సంఘటనలు జరిగాయంటే కేంద్ర ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనేది కూడా మనకు అర్థమవుతుందనీ అన్నారు. దీనికి బాధ్యులు అయినటువంటి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు, యువకులు, తల్లిదండ్రులు అంతా కలిసి శాంతియుత నిరసన వ్యక్తం చేస్తున్నప్పుడు వారిపై లాఠీచార్జ్ చేయించడాన్ని దేశం మొత్తం తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. దేశంలో ఇలాంటి పరిస్థితులను చూస్తూ ఉంటే ప్రజాస్వామ్యం ఎంత ప్రమాదంలో పడిందనేది అర్థమవుతుందనీ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసిన అవసరం ఈరోజు దేశవ్యాప్తంగా ఉన్నటువంటి ప్రజలందరి పైన ఉన్నదని అన్నారు. కాబట్టి సేవ్ ఇండియా, సేవ్ డెమోక్రసీ అనే నినాదాన్ని దేశవ్యాప్తంగా వినిపించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇప్పటికైనా దేశ ప్రధాని మోడీ స్పందించి పేపర్ లీకేజ్ కి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ ను రాజీనామా చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులు చేస్తున్న పోరాటానికి ప్రజాస్వామిక వాదులంగా మేము పూర్తి సంఘీభావం తెలుపుతున్నామని వారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామికవాదులు బోయ సుధాకర్, బోయ కుమార్, పంది రాకేష్, ఏర్పుల సాయి, చేకూరి బాబు, కట్టెల ప్రదీప్, మాదాను ఆకాష్, ఎర్ర బాబు, ఓర్సు గణేష్, దోర్నాల వంశీ తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో టీజేఏ ముందుండాలి: తుంబూరి దయాకర్ రెడ్డి

- **ఖమ్మంలో ఘనంగా తెలంగాణ జర్నలిస్టుల అసోసియేషన్ (టీజేఏ) వార్షికోత్సవ వేడుకలు**
- **పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసిన క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్**
- **పలు చోట్ల పండ్ల పంపిణీ సామాజిక సేవా కార్యక్రమాలు**

**క్రైమ్ మిర్రర్ ఖమ్మం :** జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారంలో తెలంగాణ జర్నలిస్టుల అసోసియేషన్ (టీజేఏ) ఎల్లప్పుడూ ముందుండాలని రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఖమ్మం లో టీజేఏ జిల్లా అధ్యక్షులు జి. నాగాస్వామి ఆధ్వర్యంలో టీజేఏ 12 వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా తుంబూరి దయాకర్ రెడ్డి మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చేందుకు జర్నలిస్టులు అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. ప్రజాస్వామ్యంలో నాల్గో స్తంభమైన మీడియా రంగానికి అందులో పనిచేసే జర్నలిస్టులకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం టీజేఏ నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు.

### వివిధ ప్రాంతాల్లో ఘనంగా వేడుకలు

### ఎస్బీఐటీ కాలేజీలో కేక్ కటింగ్

ఖమ్మం నగరంలోని ఎస్బీఐటీ కాలేజీలో టీజేఏ ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. కాలేజీ చైర్మన్ ఆర్జెసి కృష్ణ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి మార్గదర్శకులుగా జర్నలిస్టులు నిలుస్తున్నారని ప్రశంసించారు. జర్నలిస్టుల సంక్షేమం వారి హక్కుల పరిరక్షణ వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం టీజేఏ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడంలో సంఘం మరింత చురుకైన పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.

### ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్ల పంపిణీ

12 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో టీజేఏ నాయకులు రోగులకు పండ్లను పంపిణీ చేశారు. రోగుల పట్ల మానవత్వంతో వ్యవహరించి వారికి పండ్లు అందించడం అభినందనీయమని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి.

### వృద్ధాశ్రమంలో ప్రేమ పూర్వక సేవలు

పాండురంగాపురంలోని జీసస్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఆశ్రమవాసుల మధ్య వార్షికోత్సవాన్ని జరుపుకోవడం వారి క్షేమాన్ని పంచుకోవడం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో టీజేఏ జిల్లా అధ్యక్షుడు అక్రిడేషన్ కమిటీ మెంబర్ జి నాగస్వామి టీజేఏ జిల్లా నాయకులు మతి రామకృష్ణ( విజయ క్రాంతి) సాయంకాలం రాంబాబు మణికుమార్ సయ్యద్ ఖాసిం ( అక్షిత తెలుగు దినపత్రిక ) వాసం రాజేంద్ర ప్రసాద్( క్రైమ్ మిర్రర్) తాళ్లపల్లి అశోక్ ( యువ గళం) సంపత్ (సంచలన వార్త) దోమల కిరణ్ మద్దెల చిన్ని పగిడిపల్లి రవి కిరణ్ బోడపట్ల సతీష్ గంజి బ్రహ్మం( తెలంగాణ కానుక) పామర్తి నాగేశ్వరరావు మల్లెబోయిన లక్ష్మణ్ రాము (వై టీవి) తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో తెలంగాణ జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా నగర నాయకులు ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన సీనియర్ జర్నలిస్టులు ఫొటోగ్రాఫర్లు ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.



# నిషేధిత గుట్కాపై సీసీఎస్ మెరుపు దాడులు..!!

- మూడు దుకాణాల్లో సీసీఎస్ ఆకస్మిక దాడులు
- రూ.1.96 లక్షల విలువైన గుట్కా స్వాధీనం
- అక్రమంగా నిల్వ, విక్రయం, రవాణా చేస్తే కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలను అరికట్టేందుకు జిల్లా పోలీసులు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా సీసీఎస్ పోలీసులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీ మొత్తంలో నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో నిషేధిత పొగాకు ఉత్పత్తుల నిల్వ, విక్రయాలు, రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతుండగా, అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. సీసీఎస్ పోలీసులు భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని చాముండా జనరల్ స్టోర్స్, దుర్గా జనరల్ స్టోర్స్, పవన కృష్ణ కిరాణం దుకాణాల్లో ఒకేసారి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అంబర్, ఆర్ఆర్, అనార్, జేకే, మీరాజ్ తదితర నిషేధిత పొగాకు ఉత్పత్తులను అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం మొత్తం రూ. 1,96,430 విలువైన గుట్కా, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ కేసులో చాముండా జనరల్ స్టోర్ నిర్వాహకుడు ఛత్రారం సతీష్ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న నిషేధిత పొగాకు ఉత్పత్తులతో పాటు తదుపరి చట్టపరమైన చర్యల కోసం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓకు అప్పగించినట్లు అధికారులు వెల్లడించారు. మిగతా దుకాణాల నిర్వాహకుల పాత్రపై కూడా విచారణ కొనసాగుతోందని సమాచారం. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ మాట్లాడుతూ, ప్రజారోగ్యానికి తీవ్ర హాని కలిగించే నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తుల నిల్వ, విక్రయం, రవాణా వంటి అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# స్వీయ సంరక్షణ దినోత్సవం –జూలై 24

### స్వీయ సంరక్షణ..మనల్ని మనం కాపాడుకోవడం

**మునుగోడు క్రైమ్ మిర్రర్:** 108 EMRI గ్రీన్ హెల్త్ సర్వీసెస్, వైద్యులు మరియు ఆసుపత్రులపై ఆధారపడకుండా మనల్ని మనం రక్షించుకోవడంలో స్వీయ సంరక్షణ యొక్క ప్రాముఖ్యతపై నివేదికను విడుదల చేసింది. స్వీయ సంరక్షణ మన ఆరోగ్యంలోని అనేక అంశాలను రక్షించడంలో సహాయపడుతుంది అని తెలంగాణా రాష్ట్ర 108 అంబులెన్స్ సేవల కార్యనిర్వాహణ అదికారి బి సుధాకర్ ప్రకటన విడుదల చేశారు.స్వీయ సంరక్షణ దినోత్సవం సమీపిస్తున్న సందర్భంగా, అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూలై 24న జరుపుకుంటారు. ఈ రోజును 2011లో యుకె ఆధారిత సంస్థ అయిన అంతర్జాతీయ స్వీయ సంరక్షణ ఫౌండేషన్ (×ూఖీ) ప్రారంభించింది. ఈ తేదీని స్వీయ సంరక్షణ అనేది రోజుకు 24 గంటలు, వారానికి 7 రోజులు పాటించాల్సిన అలవాటు అని సూచించడానికి సింబాలిక్ గా ఎంచుకున్నారు.

**స్వీయ సంరక్షణ - ఛాతీ నొప్పి:**

108 EMRI అత్యవసర సేవల నిర్వహణ నివేదిక ప్రకారం, జనవరి 2026 నుండి జూన్ 2026 వరకు తెలంగాణలో 17,940 ఛాతీ నొప్పి కేసులు నమోదయ్యాయి. హృదయ సంబంధిత వ్యాధులు 30 మరియు 40 ఏళ్ల వయస్సులో ఉన్నవారిని కూడా ఎక్కువగా ప్రభావితం చేస్తుండడం ఆందోళన కలిగించే విషయం. స్వీయ సంరక్షణలో భాగంగా మన ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు పరీక్షించుకోవడం చాలా అవసరం. ముఖ్యంగా గుండె జబ్బులను నివారించడానికి బ్లడ్ ప్రెషర్, ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ మరియు లిపిడ్ ప్రొఫైల్ వంటి పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవాలి. పరీక్షలు చేయించుకోవడంతో పాటు, ఆహారం, వ్యాయామం మరియు మానసిక ప్రశాంతపై కూడా ఎక్కువ శ్రద్ధ వహించాలి.

**సామాన్య ప్రజల కోసం “నజూూ=ు” 5-దశల స్వీయ సంరక్షణ ప్రణాళిక**

H ఆరోగ్యకరమైన ఆహారం ప్రతి భోజనంలో 1 పండు ం 1 కూరగాయ జోడించండి

E వ్యాయామం రాత్రి భోజనం తర్వాత 30 నిమిషాలు నడవడం

A పొగాకు/మద్యం మానుకోవడం 1 సిగరెట్/బీర్ కు “వద్దు” అని చెప్పండి

R క్రమం తప్పని పరీక్షలు ప్రతి 3 నెలలకు ఒకసారి ద్రీ చెక్

T ప్రశాంతమైన మనస్సు నిద్రకు ముందు 10 నిమిషాలు ధ్యానం



గత ఏడు సంవత్సరాలలో భారతదేశంలో గుండె జబ్బులతో బాధపడుతున్న వారి సంఖ్య దాదాపు మూడు రెట్లు పెరిగింది. ఇంకా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, 15 నుండి 29 సంవత్సరాల వయస్సు గల యువకులు కూడా గుండె జబ్బులకు గురవుతున్నారు, జాతీయ గణాంక సంస్థ (చీూ) తాజా సర్వే ఫలితాల ప్రకారం తెలుపబడింది.

**స్వీయ సంరక్షణ - స్ట్రోక్;**

108 జువీ=× అత్యవసర సేవల నిర్వహణ నివేదిక ప్రకారం, గత 6 నెలల్లో తెలంగాణ రాష్ట్రంలో 5025 స్ట్రోక్ సంబంధిత అత్యవసర కేసులు నమోదయ్యాయి. బ్రెయిన్ స్ట్రోక్ కేసులు కూడా వేగంగా పెరుగుతున్నాయి. బ్రెయిన్ స్ట్రోక్ కు ప్రధాన కారణాలు అధిక రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు మరియు అధిక కొలెస్ట్రాల్. వీటన్నిటికీ ప్రధాన కారణం వ్యక్తుల జీవనశైలి. వీటిని నివారించడానికి చురుకైన స్వీయ సంరక్షణ అవసరం.

**ఇవన్నిటికంటే గొప్ప సేవలో వీరు,**

ఆపద ఏం వచ్చినా 108 కి కాల్ చేసిన వెంటనే పగలు రాత్రి అని తేడా లేకుండా సంఘటన స్థలానికి వెళ్లి ఆస్పత్రికి చేరేలోపే క్షతగాత్రులకు 108 వాహనంలో ఉన్న అత్యాధునికమైన వైద్య పరికరాలతో నిపుణులైన వైద్యులు మాదిరిగా మునుగోడు 108 సిబ్బంది ప్రాథమిక వైద్యం అందిస్తున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గుంటి రమేష్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ నల్లగంటి వరప్రసాద్ రథసారథులైన ఎస్కే మునీర్ మరియు ఎండి గాలిబ్ సిబ్బంది వందలాది మంది ప్రాణాలను కాపాడిన ఆపద్బాంధవులుగా నిలుస్తున్నారు. వీరి సేవలను మండల ప్రజలు కొనియాడుతున్నారు.



# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం తగదు..

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్.

**కేశంపేట,(క్రైమ్ మిర్రర్):** నీట్ పేపర్ లీక్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని, విద్యార్థులు న్యాయమైన హక్కుల కోసం నిరసన తెలుపుతుంటే విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడమే కాక, వారికి అండగా నిలిచిన లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాని ఖూనీ చేయడమే అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనుమగళ్ళ రమేష్ అన్నారు.నీట్ పేపర్ లీక్ ఘటనపై నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై లాఠీచార్జ్ను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అనుమగల్ల రమేష్ ఆధ్వర్యంలో కేశంపేటలో గురువారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పై లాటి చార్జ్ చేయడం అమానుషమని, విద్యార్థులకు మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, నీట్ పేపర్ లీక్ ఘటనపై స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు గూడ వీరేష్, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఎస్ఐఆర్‌లో పాల్గొనాలని ఎమ్మెల్యే జీఎంఆర్ పిలుపు

### 30 ప్రచార రథాలకు జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎమ్ఆర్

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 23:** ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అమూల్యమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో పాల్గొని ఆగస్టు 3లోపు తమ దరఖాస్తులను సమర్పించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు.పటాన్చెరు డివిజన్‌లోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఎస్ఐఆర్ అవగాహన కోసం ఏర్పాటు చేసిన 30 ప్రచార రథాలను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతోనే ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ భాగస్వామ్యానికి ఓటు హక్కు తొలి మెట్టని పేర్కొన్నారు. పటాన్‌చెరులో శాశ్వతంగా నివసిస్తున్న ప్రతి అర్హ ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని, లేనిపక్షంలో ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ప్రచార రథాలు నియోజకవర్గంలోని తొమ్మిది డివిజన్లు, మూడు మున్సిపాలిటీలు, రెండు మండలాల్లో విస్తృతంగా తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తాయని తెలిపారు.



## సంగారెడ్డి జిల్లా పోలీసుల పనితీరు ప్రశంసనీయం



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 23:** భాగంగా మల్టీ జోన్--××  ఐజి షానవాజ్ ఖాసిం, ఐపీఎస్. గురువారం సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయం, సంగారెడ్డి ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి తదితరులు ఐజికి స్వాగతం పలికారు. ఐజి పునరుద్ధరించిన జిల్లా స్పెషల్ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభించి, వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, నేరాలు జరిగిన తర్వాత ఛేదించడం కంటే ముందుగానే నివారించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. అధిక నేరాలు నమోదవుతున్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని, సీసీటీఎన్ఎస్--2.0, టీఎస్-కాప్, ఈ-సాక్ష్య, సైబర్ క్రైమ్ పోర్టల్, సీఈఐఆర్ వంటి వ్యవస్థలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి ఫిర్యాదును సకాలంలో నమోదు చేసి రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. వర్షాకాలంలో వరదలు, చెరువులు, కుంటల వద్ద ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం సంగారెడ్డి ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను సందర్శించి పరిశుభ్రత, రికార్డుల నిర్వహణను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల నియంత్రణపై కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అనుమానిత వ్యక్తులు, పత్రాలు లేని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని డీఎస్పీలకు సూచించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందిస్తూ రివార్డులు ప్రకటించారు. జిల్లా పోలీసు కార్యాలయం, ట్రాఫిక్ పోలీసు స్టేషన్ నిర్వహణ సంతృప్తికరంగా ఉందని పేర్కొన్న ఐజి, సంగారెడ్డి జిల్లా పోలీసుల పనితీరును ప్రత్యేకంగా అభినందించారు.

## ఎన్ఎస్యూఐ ఆధ్వర్యంలో జరగబోయే విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయాలి

**ఎన్ఎస్యూఐ మండల అధ్యక్షుడు యాస సుభాష్ రెడ్డి**



**ఆత్మకూరు(ఎం),జూలై23/క్రైమ్ మిర్రర్:** ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడిని ఖండిస్తూ శుక్రవారం రోజు జరిగే విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయాలని ఆత్మకూరు(ఎం)మండలం ఎన్ఎస్యూఐ మండల అధ్యక్షుడు యాస సుభాష్ రెడ్డి పిలుపునిచ్చారు. నీట్ పేపర్ లీకేజీ పైన ఢిల్లీలో జరుగుతున్న నిరసనలో భాగంగా ఢిల్లీలో విద్యార్థి యువతపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ఎన్టిఏ ను రద్దు చేయాలని, ఢిల్లీలో విద్యార్థి యువతపై జరిగిన దాడులపై పారదర్శకంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విపక్ష నాయకులు రాహుల్ గాంధీని అక్రమ అరెస్టులు చేయడం సిగ్గుచేటని పేపర్ లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని గల మెత్తితే అరెస్టు చేస్తారా అంటూ ప్రశ్నించారు. రేపు జరిగే నిరసన బంద్ ను విజయవంతం చేయాలని కోరారు. ఈ బందులో ఎన్ఎస్యూఐ కార్యకర్తలు అందరూ పాల్గొనాలని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసారు.

# రిటైర్డ్ ఉద్యోగుల న్యాయమైన దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించాలి

- రిటైర్డ్ ఉద్యోగుల హెల్త్ కార్డులు పరిష్కరించాలి
- పే రివిజన్ కమిటీని వెంటనే పరిష్కరించాలి
- పెండింగ్ లో ఉన్న ఆరు డిఎ లను వెంటనే విడుదల చేయాలి

**క్రైమ్ మిర్రర్ ఖమ్మం:** ఖమ్మంలో రిటైర్డ్ ఉద్యోగుల ప్రదర్శన. రిటైర్డ్ ఉద్యోగుల న్యాయమైన దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వందలాదిమంది పెన్షనర్లు ఖమ్మంలో రోడ్ ఎక్కారు. పెన్షనర్ల నుండి డబ్బులు వసూలు చేసి కూడా హెల్త్ కార్డులను విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేస్తూ పెన్షనర్లను మానసికంగా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వ విధానాల పట్ల వారు తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు. పే రివిజన్ కమిటీ రిపోర్టును వెంటనే ప్రకటించాలని పెండింగ్ లో ఉన్న ఆరు డి ఎ లను వెంటనే విడుదల చేయాలని పెన్షనర్ల పట్ల ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని నినాదాలు చేస్తూ హెల్త్ కార్డుల అమలులో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని నిరసించారు. పెన్షనర్ల జిల్లా కార్యవర్గ సభ. ప్రదర్శన అనంతరం ఖమ్మం రోటరీ నగర్ లోని రాజరాజేశ్వరి కళ్యాణ మండపంలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా ఖమ్మం నల్గొండ వరంగల్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ పెన్షనర్ల ప్రయోజనాల సక్రమ విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతుందని కొందరు అధికారులు సరైన సమాచారాన్ని సక్రమమైన పద్ధతిలో ముఖ్యమంత్రి వివరించకపోవడం వలన జాప్యం జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని హెల్త్ కార్డుల మంజూరీలో అనేక తప్పులు జరిగాయని వాటిని సవరించడం కోసం ముఖ్యమంత్రి గారితో మాట్లాడటం జరిగిందని అన్నారు. సమగ్ర ప్రయోజనాలు కలిగించే హెల్త్ కార్డులను వారం రోజులలోగా విడుదల అయ్యే విధంగా కృషి చేస్తానని అదే రకంగా ఉద్యోగ పెన్షనర్ల పే రివిజన్ కమిషన్ రిపోర్టును ప్రకటించి అమలు కోసం తన వంతు కృషి చేస్తానని పెండింగ్లో ఉన్న డి ఏ లు విడుదల కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి తోనూ అధికారులతోనూ మాట్లాడడం జరిగిందని తెలిపారు. తాను కూడా పెన్షనర్ల సంఘ సభ్యులు అని పెన్షనర్ల ఇబ్బందులు చాలా అన్యాయమైన మని వాటి పరిష్కారంలో ముందుండి కొట్లాడుతానని రాష్ట్రంలోని 33 జిల్లాల్లో గల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం తన వెంటనే ఉండదని వారి న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఆందోళనకు కూడా సిద్ధమని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పేరి వెంకటరెడ్డి మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘానికి




హెల్త్ కార్డు ట్రస్ట్ బోర్డులో మన సంఘ నికి ప్రాతినిధ్యం కల్పించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. 2024 మార్చి తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వారి ప్రయోజనాలన్నీ విడుదల చేయడంలో తన వంతు కృషి చేశానని ఇంకనూ అనేకమంది పెండింగ్లో ఉన్నాయని వాటికోసం జేఏసీ ద్వారా ఇప్పటికే ప్రాతినిధ్యం చేసి ముఖ్యమంత్రి గారిని స్వయంగా కలిసి వివరించడం జరిగిందని ఒక నెల రోజుల్లో గా సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రంలోని 33 జిల్లాలలోని 1,50,000 మంది మన సంఘ సభ్యులు ఆందోళనకు దిగుతామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో సంఘ ఐక్యత కోసం కృషి చేస్తామని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరు వేణు మాట్లాడుతూ ఈరోజు జరిగిన కార్యవర్గ సమావేశంలో జిల్లాలోని సత్తుపల్లి పెనుబల్లి కల్లూరు తల్లాడ ఏన్కూరు వైరా ఎర్రిపాలెం మధిర నేలకొండపల్లి కూసుమంచి తో పాటు ఖమ్మం నగరంలోని నాలుగు శాఖల ప్రధాన బాధ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారని గత ఆరు నెలల కాలంలో సంఘం నిర్వహించిన కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వం వెంటనే పాటించాలని అదే రకంగా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో గల వెల్నెస్ సెంటర్ ను ఆధునికరించాలని పూర్తి కాలం డాక్టర్లు ఉండే విధంగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుబాకుల వెంకటేశ్వర్లు అసోసియేట్ అధ్యక్షులు పి సీతారామయ్య. కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు వెస్లీ మరియు మహబూబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మైస నాగయ్య శ్యామ్ కుమార్ ఖమ్మం జిల్లా నాయకులు ఎస్ పూర్ణచంద్రరావు ఆర్ వెంకటనారాయణ చెంచు రెడ్డి దుర్గాదేవి జనార్ధన్ కాజా మొయినుద్దీన్ జానయ్య కృష్ణారెడ్డి రాష్ట్ర నాయకులు వజ్రా శ్రీనివాసరావు చల్ది బాబురావు ఉపేందర్ రావ్ నగర నాయకులు రమేష్ సత్యనారాయణ జి వెంకటేశ్వర్లు రమణ యాదవ్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గంజా నెట్‌వర్క్‌పై పోలీసుల ప్రత్యేక దృష్టి..!!

- మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక ఆపరేషన్
- గంజా నిందితుల ఇళ్లలో సీసీఎస్ సోదాలు
- సీసీఎస్ దాడులతో గంజా నిందితుల్లో కలకలం
- గంజా రహిత జిల్లానే లక్ష్యం : ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా భూపాలపల్లి జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలను మరింత ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా సీసీఎస్ పోలీసులు గురువారం నార్కోటిక్ డాగ్ సహాయంతో భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. భూపాలపల్లి పట్టణంలోని రాంనగర్, కాకతీయ కాలనీ, జంగేడు, ఖాసింపల్లి ప్రాంతాల్లో గతంలో గంజా కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులు, గంజా వినియోగదారుల ఇళ్లు, వాటి పరిసర ప్రాంతాలను నార్కోటిక్ డాగ్ సహాయంతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గంజా నిల్వ, విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు పరిశీలించారు. తనిఖీల సందర్భంగా గంజా నిందితులు, వినియోగదారులు, వారి కుటుంబ సభ్యులతో పోలీసులు ప్రత్యేకంగా మాట్లాడారు. గంజా విక్రయం, రవాణా, నిల్వ, వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలు వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని అవగాహన కల్పించారు. అలాగే గంజా సంబంధిత నేరాలపై జిల్లా పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారని, భవిష్యత్తులో ఎవరైనా గంజా సేవిస్తున్నట్లు లేదా గంజా విక్రయం, రవాణా, నిల్వ వంటి నేరాల్లో పాల్గొన్నట్లు గుర్తిస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, గంజా విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు సమీప పోలీస్ స్టేషన్ లేదా జిల్లా పోలీసులకు అందించాలని సీసీఎస్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా జిల్లా పోలీసులు నార్కోటిక్ డాగ్ సహాయంతో ప్రత్యేక తనిఖీలు, నిఘా చర్యలు, అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ గంజా నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# రెండేళ్లైనా పూర్తి కాని 65 వ జాతీయ రహదారి పనులు

- రోజూ ట్రాఫిక్ జామ్‌తో ప్రజలకు నరకయాతన, రోగుల తరలింపుకూ తీవ్ర ఇబ్బందులు
- నాసిరకం పనులతో ప్రమాదాలు జరుగుతున్న వైనం
- గుంతలలో నీరు నిల్వతో పెరుగుతున్న ప్రమాదాలు
- పనులు వేగవంతం చేయకపోతే ఆందోళన చేస్తామంటూ హెచ్చరిక
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
- సిపిఎం నేత నేత రాజయ్య డిమాండ్



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 23:** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), సిపిఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో జాతీయ రహదారి విస్తరణ పనులలోనీ గుంతలను ముత్తంగి, ఇస్నాపూర్, లక్డారం తదితర ప్రాంతాలను మరియు ట్రాఫిక్ జామ్ అయ్యే కేంద్రాలను సిపిఎం బృందం గురువారం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం నేత కె. రాజయ్య మాట్లాడుతూ.. జాతీయ రహదారి పనులను వేగంగా మరియు నాణ్యతగా పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాలైనా జాతీయ రహదారి పనులు పూర్తి కాకపోవడం విచారకరమని ఆయన అన్నారు, కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోడ్డు విస్తర పనులలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన సంగారెడ్డి నుంచి లింగంపల్లి వరకు అనేక చోట్ల ట్రాఫిక్ విపరీతంగా జామవుతుందని, గంటల సమయం వృధా అవుతుందని ఆయన అన్నారు. అలాగే ఈ రోడ్డుపైన రోజు బైకులు, వాహనాలు బోల్తా పడుతున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నాయని చాలామందికి కాళ్లు, చేతులు విరుగుతున్నాయని గాయాల పాలు అవుతున్నారనీ ఆయన అన్నారు, ముందస్తు ప్రాణాలిక లేకుండా, రోడ్డు విస్తరణ పనులు చేయడం ద్వారానే ట్రాఫిక్ జామవుతుందని, గుంతలు తొందరగా పోర్చకపోవడం వల్లనే వర్షం నీరు జామ అవుతుందని ఆయన అన్నారు. గుంతలలో బైకులు, భారీ వాహనాలు పడుతున్నాయని అన్నారు, వర్షాలు ఎక్కువ వచ్చినప్పుడు వర్షం నీరు రోడ్డు మీదకు రావడం వలన కూడా ట్రాఫిక్ జామ్ అవుతుందని, కనీసం తగిన చర్యలు తీసుకోకపోవడం వలన ఇవి జరుగుతున్నాయని ఆయన అన్నారు. కాంట్రాక్టర్ పై చర్య తీసుకోవాలని, వెంటనే కాంట్రాక్టును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే నాసిరకం పనులు కూడా చేస్తున్నారని ఆయన విమర్శించారు, మోరీలు నిర్మిస్తే నెల రోజులు కాకముందుకే అవి కూలిపోతున్నాయని ఆయన అన్నారు. మ్యాన్ హోల్ సరిగా వేయలేదని ఆయన అన్నారు. సిమెంటు, కంకర ఇసుక తదితర మెటీరియల్ సరిగా వాడట్లేదని అన్నారు. కవలం పేట, గణేష్ గడ్డ, రుద్రారం, ఇస్నాపూర్, ముత్తంగి, పటాన్‌చెరు, బీరంగూడ అనేక చోట్ల ట్రాఫిక్ జామవుతుందని ఆయన అన్నారు. పేషెంట్లను హైదరాబాద్ కి తరలించాలంటే ప్రాణాలు పోతున్న పరిస్థితి ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి అధికారులు నిద్రపోతున్నారా..? అని ఆయన ప్రశ్నించారు. పనులు నెమ్మదిగా జరగడానికి కారకులు ఎవరని ఆయన అన్నారు, జిల్లా అధికారులు తక్షణమే జోక్యం చేసుకొని విస్తరణ పనులు వేగంగా జరిగేటట్టుగా చూడాలని, నాణ్యతగా పనులు జరిగేటట్టుగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు పాండురంగారెడ్డి, నాయకులు సదాశివరెడ్డి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## కేజ్ వీల్స్‌తో బీటి రోడ్డుపై ట్రాక్టర్ నడిపితే వెంటనే చర్యలు తీసుకుంటాం



**వనపర్తి జూలై 23 క్రైమ్ మిర్రర్:** కొత్తగా వేసిన బీటీ రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ హెచ్చరించారు. పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో మన రోడ్లను మనమే కాపాడుకుందాం.... కేజీ వీల్స్ తో రోడ్డు ప్రయాణం వల్ల జరిగే నష్టాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీటీ రోడ్డుపై కేజ్‌వీల్స్ తో ట్రాక్టర్ నడపవద్దని సూచించారు. రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌ను నడపరాదని.. ఒకవేళ రోడ్డు మీదకు ట్రాక్టర్‌ను తీసుకు వస్తె చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. బీటీ రోడ్లపై ట్రాక్టర్ కేజ్‌వీల్స్ తో నడిపితే రోడ్డు పగుళ్లుపోతుందని. అందరికీ, ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడే రోడ్డును పాడు చేసుకోవద్దన్నారు. ట్రాక్టర్ కేజ్‌వీల్స్ ను నడిపించవద్ధని వాహనదారులు రో డ్డు భద్రత నియమాలు పాటించకుండా రాష్ డ్రై వింగ్‌చేస్తూ రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందుతూ కుటుంబాలను వీధీ పాలు చేస్తున్నారన్నారు. ప్రతి వా హనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటిం చాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ దరిం చి నడపాలని, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వ వద్దని, మద్యం సేవించి ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్దింటి నందీశ్వర్, వార్డు సభ్యులు పులెందర్ రెడ్డి, రవి సాగర్, సతీష్, దేవర్ల బీసుపల్లి, దాది రాముడు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కావలి బాలస్వామి, దారపోగు వెంకటేష్, ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, తిరుపతి రెడ్డి, వేణు గౌడ్, గడ్డం శేఖర్ మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు బీఎస్పీ పోరాటం ఆగదు

- ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఇంటి స్థలం, యువతకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్
- ప్రభుత్వాల నిర్లక్ష్యంతో న్యాయానికి దూరమైన నిర్వాసితులు
- బీఎస్పీ మునుగోడు నియోజకవర్గ ఇంచార్జ్ ఐతరాజు అభయేందర్
- ఇప్పటికి పూర్తి కానీ ప్రాజెక్ట్ పనులు.. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమా..!?
- నిర్మాణ నాణ్యతపై విచారణ చెయ్యండి పబ్లిక్ డిమాండ్.

**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో భాగంగా నిర్మిస్తున్న, చర్లగూడెం ప్రాజెక్టు కారణంగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు, సంపూర్ణ న్యాయం జరిగే వరకు బహుజన్ సమాజ్ పార్టీ పోరాటం ఆగదని, బీఎస్పీ మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ ఐతరాజు అభయేందర్ స్పష్టం చేశారు. మర్రిగూడ మండల బీఎస్పీ అధ్యక్షుడు నాగిళ్ల మారయ్య ఆధ్వర్యంలో, చర్లగూడెం ప్రాజెక్టు వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల అభివృద్ధి పేరుతో భారీ ప్రాజెక్టులు నిర్మిస్తున్న ప్రభుత్వాలు, భూములు కోల్పోయిన నిర్వాసితుల జీవితాలను పూర్తిగా విస్మరిస్తున్నాయని విమర్శించారు. ప్రాజెక్టు కోసం తమ పూర్వీకుల ఆస్తులు, సాగుభూములను ప్రభుత్వానికి అప్పగించిన కుటుంబాలు ఇప్పటికీ సరైన పునరావాసం లేక, ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

2013 భూసేకరణ చట్టం ప్రకారం పూర్తి హక్కులు అమలు చేయాలి 2013 భూసేకరణ, పునరావాస, పునర్నిర్మాణ చట్టం ప్రకారం నిర్వాసితులకు లభించాల్సిన అన్ని హక్కులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి పూర్తి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఇంటి స్థలం, అవసరమైన మౌలిక వసతులు, చదువుకున్న యువతకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని ఆయన కోరారు. కేవలం భూములకు పరిహారం చెల్లించడం ద్వారా ప్రభుత్వ బాధ్యత ముగిసిపోదని, నిర్వాసితుల భవిష్యత్తుకు భరోసా కల్పించే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.

### ఏళ్లుగా పూర్తికాని పనులు... ప్రభుత్వాల వైఫల్యమే

చర్లగూడెం ప్రాజెక్టు కోసం భూములు సేకరించి ఎన్నో సంవత్సరాలు గడిచినా, పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడం గత, ప్రస్తుత ప్రభుత్వాల పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని అభయేందర్ విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కావడంతో ఒకవైపు ప్రజలు భూములు కోల్పోయి, ఉపాధి లేక ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు ప్రాజెక్టు ప్రయోజనాలు కూడా ప్రజలకు అందకపోవడం దురదృష్టకరమన్నారు. అభివృద్ధి పేరిట ప్రజలను నిర్వాసితులుగా మార్చి, తర్వాత వారి సమస్యలను పూర్తిగా విస్మరించడం బాధాకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే భూ నిర్వాసితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ప్రజల సమస్యల పరిష్కారం కంటే రాజకీయ పదవులపైనే ఎక్కువ దృష్టి పెట్టారన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం, నిర్వాసితుల సమస్యలు, రైతుల ఇబ్బందులపై ప్రభుత్వం దృష్టి సారించేలా ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. మునుగోడు నియోజకవర్గం మొత్తం ఫ్లోరైడ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన కీలక అంశాలను కూడా నిర్లక్ష్యం చేయడం ఆందోళన కలిగించే విషయమన్నారు. చర్లగూడెం భూ నిర్వాసితులకు పూర్తి న్యాయం జరిగే వరకు, బహుజన్ సమాజ్ పార్టీ వారి పక్షాన రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆందోళనలు నిర్వహిస్తామని ఐతరాజు అభయేందర్ హెచ్చరించారు. నిర్వాసితుల హక్కుల కోసం బీఎస్పీ ఎప్పటికీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఏండ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రాజెక్టు పనులు పూర్తి కాకపోవడం వెనుక, అధికారుల నిర్లక్ష్యం ఉందా..! లేక ప్రభుత్వ నిర్లక్ష్యమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.. ప్రాజెక్టు నాణ్యత పై అనేక అనుమానాలు ఉన్నాయని ప్రజల ఆరోపణ, ఇప్పటికే ప్రాజెక్టు కట్ట అక్కడక్కడ కుంగిపోయినట్లు తెలుస్తుంది..! ప్రతిపక్షాలు సైతం దీనిపై మాట్లాడాలని మర్రిగూడ ప్రజలు కోరుతున్నారు..? ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కత్తుల పరమేష్, నియోజకవర్గ ఇన్‌చార్జ బొట్ట శివ, నియోజకవర్గ ఉపాధ్యక్షులు సుక్క రాములు, నారాయణపురం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల గిరి, చౌటుప్పల్ మండల ఉపాధ్యక్షుడు మస్కు ఉదయ్, నాయకులు పల్లేటి రతివ, ఈద నరేష్, సురేష్, విజయ్ కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

